
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 26.0 కనిష్ఠం : 20.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 1 డిసెంబరు 2025

పంచాయతీల విభజనకు గ్రీన్‌సిగ్నల్

- పునర్ వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేత
- జీఓ విడుదల
- మార్పులకు అవకాశం

7





బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ ఆనంద్

ఆటవిడుపు..!

అనంతపురం జిల్లా రెవెన్యూ జట్టు, శ్రీసత్యసాయి జిల్లా పోలీసు జట్ల మధ్య స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం ఆటవిడుపుగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. అనంతపురం కలెక్టర్ ఆనంద్, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బ్యాటింగ్‌తో అలరించారు. ● వివరాలు 7లో..

చలిలో పోలీసు తనిఖీలు

● 72 బైక్‌లు, 3 ఆటోలు, 64 మద్యం బాటిళ్లు స్వాధీనం





అనంతపురం రూరల్ ప్రాంతంలో కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): చలి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా.. పోలీసులు వేకువజామునే తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో ఆదివారం తెల్లవారుజామునే డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు రంగంలోకి దిగారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డివిజన్లలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల ఇళ్ల, పల్లెల్లోని పశువుల పాకలు, గడ్డివాములు ఉన్న ప్రాంతాలను కుణ్ణంగా తనిఖీలు చశారు. పలు గ్రామాలు, కాలనీల్లో ఫుట్ పెట్రోలింగ్ చేశారు. అన్ని డివిజన్ల పరిధిలో రికార్డులు లేని 72 బైక్‌లు, మూడు ఆటోలు, 64 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గొడవలు, అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జీవించాలని, మట్కా, పేకాట జోలికి వెళ్లవద్దంటూ పోలీసులు ప్రజలకు సూచించారు.

స్వర్ణోదయం

తెల్లవారుజామున పొగమంచు విపరీతంగా కమ్మేస్తోంది. ఉదయమైనా వీడట్లేదు. ఆ దట్టమైన పొగమంచును పారదొలుతూ భానుడు స్వర్ణ కాంతులు వెదజల్లుతూ ఉదయించాడు. కంబదూరు సమీపాన ఆదివారం ఉదయం ఈ దృశ్యం ఆహ్లాదం పంచింది.

-కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి)



కంబదూరు వద్ద స్వర్ణకాంతులు వెదజల్లుతున్న సూర్యుడు

వైసీపీ కోటి సంతకాలు.. ఓ డ్రామా

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- 27మందికి రూ.17.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): వైసీపీ కోటి సంతకాల కార్యక్రమం ఓ పెద్ద డ్రామా అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం 27 మంది లబ్ధిదారులకు రూ. 17.50 లక్షల విలువైన చెక్కుల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలందరికి వైద్యం అందించాలని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్టీఆర్‌వైద్య సేవలను మరింత విస్తృతం చేసేందుకు తాజాగా చర్యలు చేపట్టిందని వివరించారు. మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో పూర్తి చేసి అన్ని వర్గాలకు వైద్య విద్య అందించాలని చూస్తోందని అన్నారు. వైసీపీ దీనిపై కుట్రలు చేస్తోందని, కోటి సంతకాల పేరుతో డ్రామా ఆడుతోందని తెలిపారు. అధికారంలో ఉండగా మెడికల్ కాలేజీలు పూర్తి చేయకుండా ఇప్పుడు ప్రభుత్వానికి అడ్డుపడాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు వైసీపీ నాటకాలను నమ్మబోరని స్పష్టం చేశారు.

ఆ పోలీసులకు మళ్లీ అవకాశం...!

- నాడు గళం విప్పిన ప్రకాష్‌పై జగన్ ప్రభుత్వం వేటు
- నేడు రిపోర్ట్ చేసుకోవాలన్న ఎస్పీ జగదీష్
- మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు కూడా..

7

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

- రేపు గంధంపూజ ● సర్వమత సమ్మేళనానికి హాజరుకానున్న ప్రముఖులు

నీట మునిగిన దానిమ్మపంట



నీళ్లలో చేలు..!

లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. రకరకాల పంటు పెట్టారు. నెలలు, ఏళ్లపాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. తీరా పంటలు చేతికొచ్చే సమయంలో నిండా మునిగాయి. పీఏబీఆర్ బ్యాక్ వాటర్ పొలాలను ముంచేసింది. కొన్ని పంటలు నీటిలో ముగినిపోగా.. మరికొన్ని తేలుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కలల పంటలు కళ్ల ముందే మునిగిపోతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. గుండెలు బాదుకుని రోదిస్తున్నారు.

పంటను ముంచిన పీఏబీఆర్ బ్యాక్ వాటర్

- సర్వం నష్టపోతున్న అన్నదాతలు
- పరిహారం కూడా అందని దుస్థితి
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కూడేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) బ్యాక్‌వాటర్ పంట పొలాలను ముంచేసింది. ఓ పక్క భూములకు పరిహారం అందక, మరోపక్క అప్పులు చేసి సాగు చేసిన పంటలు నీటిలో మునిగిపోవడంతో అన్నదాతలు సర్వం నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. 11.100 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పీఏబీఆర్ నిర్మాణం చేపట్టారు. మైలారంపల్లి, పెద్దకొకుంట్ల, కోనంపల్లి, బూదిగుమ్మ, అంకంపల్లి, రాకెట్ల, జయపురం, ఎంఎం హళ్లి, కొర్రకోడు తదితర గ్రామాల పరిధిలో 5,830 ఎకరాల సాగు భూమిని విడతల వారీగా సేకరించారు. డ్యాంకి లీకేజీలు ఏర్పడడంతో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయలేదు. ప్రస్తుతం నీటి నిల్వ 5 టీఎంసీలు దాటడంతో (మిగతా 7లో)



నీట మునిగిన బోరు, టమోటా పంట

బాధ్యతల స్వీకరణ



ఎస్ఈగా బాధ్యతలు చేపడుతున్న సంజీవరాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) అనంతపురం సర్కిల్ ఎస్ఈగా సంజీవరాయుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎస్ఈ, ఈఈగా ఉన్న సుధాకర్‌రెడ్డి ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో విజయవాడలో నేషనల్ హైవే విభాగంలో ఈఈగా పని చేస్తున్న సంజీవరాయుడును ఉద్యోగోన్నతిపై నియమించారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఈఈగా కూడా వ్యవహరించనున్నారు. నూతన ఈఈ వచ్చేవరకు ఆ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. నూతన ఎస్ఈ సంజీవరాయుడుకు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పింఛన్ల సొమ్ము పంపిణీ

- జిల్లాకు రూ.125.39 కోట్లు మంజూరు



అనంతపురం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలకు సంబంధించిన పింఛన్ల సొమ్మును సోమవారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది.. లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నారు. డిసెంబరు నెలకు సంబంధించి జిల్లాలోని 2,81,298 మంది లబ్ధిదారులకు రూ.125.39 కోట్లు పింఛన్ సొమ్ము మంజూరైందని డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. తొలిరోజు పింఛన్ తీసుకోని లబ్ధిదారులు.. స్థానిక సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పింఛన్ సొమ్ము పొందాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం..!

● కేజీబీవీల్లో 'విజయ పథం' ప్రణాళిక ● రోజూ స్టడీ అవర్స్.. పరీక్షలు ● సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ

అనంతపురం విద్య, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తు న్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్ ఈ పబ్లిక్ పరీక్షలపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే మంచి కళాశాలల్లో ఉన్నత చదువులు చదువుకోడానికి అవకాశాలు ఉంటాయి. ఏటా కోట్లాది రూపాయలు వ్యయం చేసి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు)లలో విద్యార్థినులకు చదువులు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం కేజీబీవీలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఇక్కడ చదువుకునే ప్రతివిద్యార్థిని ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం 'విజయ పథం' పేరుతో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది.

ప్రతిష్టాత్మకంగా విజయపథం

జిల్లాలో 32 కేజీబీవీలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి కేజీబీవీలోనూ క్లాసుకు 40మంది చొప్పున విద్యార్థినులు ఉంటారు. పదో తరగతి విద్యార్థినులు 1260 మంది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి 2,560 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో ప్రతివిద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి సమగ్రశిక్ష యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం విజయపథం పేరుతో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు.

ప్రణాళిక ఇలా...

- ప్రతిరోజూ ఉదయం 5-30 గంటల నుంచి 7గంటల వరకు.. సాయంత్రం 7-30 నుంచి రాత్రి 10-30 వరకు స్టడీ అవర్స్
- బోధించిన పాఠాలపై నిత్యం పరీక్షల నిర్వహణ.
- పరీక్షల్లో మార్కులు ఆధారంగా ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించడం.
- వెనుకబడిన సబ్జెక్టుల్లో పట్టు సాధించడానికి ఆయా పాఠ్యాంశాలలో మెలకువలు నేర్పించడం.



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న కేజీబీవీ విద్యార్థినులు

సామర్థ్యాలను గుర్తించవచ్చు



పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలనే ఆశయంతో చదువులు చెబుతున్నాం. ప్రత్యేక ప్రణాళిక వల్ల సామర్థ్యాలను గుర్తించడానికి వీలవుతుంది. వెనుకబడిన సబ్జెక్టులలో మెలకువలు నేర్పించి మరింత ముందుకు తీసుకుపోగలుగుతున్నాం. దీంతో మంచి ఫలితాలు వచ్చేఅవకాశం ఉంది.

-శారద, సీఆర్‌టీ, ఫిజిక్స్, రాప్తాడు

ప్రణాళికతో ఎంతో ఉపయోగం



మంచి మార్కులతో అందరూ పాస్‌కావడానికి నిర్వహిస్తున్న విజయ పథం ప్రణాళిక ఎంతో ఉపయోగకరంగా ఉంది. నిత్యం చదువుపైనే దృష్టి పెడుతున్నాం. నిత్యం పరీక్షల నిర్వహిణతో ఏ సబ్జెక్టులో వెనుకబడ్డామో తెలిసిపోతుంది. ఆ సబ్జెక్టుపై మరింత శ్రద్ధపెట్టి చదువుకొని మరిన్ని మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉంది. రోజూ ప్రణాళికను కష్టం అనే భావన లేకుండా కష్టపడి చదువుకుంటున్నాం. మంచి మార్కులతో పాసవుతాం.

- జి.మల్లిక, పదోతరగతి, బెళుగుప్ప

పక్కాగా ప్రణాళిక అమలు



రాష్ట్ర, జిల్లా ఎస్ఎస్ఏ అధికారులు ఆదేశాల మేరకు విజయపథం ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఉత్తమ మార్కుల సాధన కోసం చదివిస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఎస్ఓ, సీఆర్‌టీ, లెక్చరర్లు షెడ్యూల్ మేరకు కష్టపడి పనిచేస్తున్నారు. -నాగవేణి, ప్రిన్సిపాల్, బుక్కరాయసముద్రం

ఉత్తమ మార్కులే లక్ష్యం



కేజీబీవీలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థిని ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ మా ర్కులు సాధించాలి. రాష్ట్ర, జిల్లా టాపర్స్‌గా నిలవాలి. అదే లక్ష్యంతో అనంత జిల్లాలో విజయపథం ప్రణాళిక అమలు చేయిస్తున్నాం. ప్రణాళిక బాగా అమలవుతోంది. పిల్లలు ఈకొద్దిరోజులు కష్టపడిచదివితే ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చు. అవసరమైన వసతులు కల్పిస్తున్నాం. - శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష



తరిమెల వంకలో మృతదేహాన్ని కష్టమ్మీద శ్మశానానికి తీసుకెళ్తున్న బంధువులు (ఫైల్)

అంతిమ యాత్రకు అవస్థలు

శింగనమల మండలంలోని తరిమెల గ్రామం అంటే దేశవ్యాప్తంగా గుర్తింపు. కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి జన్మించిన ఊరు. అలాంటి ఊరిలో ఎవరైనా చనిపోతే.. శ్మశానానికి వెళ్లేందుకు దారి కూడా లేదు. వంక నీటిలో వెళ్లాల్సిందే. తరిమెలలో మసీదు సమీపాన శ్మశాన వాటిక ఉంది. శ్మశాన వాటికకు వెళ్లే దారిలో వంక ఉంది. అందులో నిత్యం నీరు ఉంటుంది. మృతదేహాన్ని ఖననానికి తీసుకెళ్లాలంటే వకంలోకి దిగాల్సిందే. అందులో నడుములోతు నీరు ఉంటుంది. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెండడంతో వంకలో శవాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబికులు, బంధువులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్మశానానికి రోడ్డు వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-శింగనమల (ఆంధ్రజ్యోతి)

ఉత్తుత్తి బడి!

ఆరునెలల క్రితమే పాఠశాల మూత

● అయినా రోజూ విద్యార్థుల హాజరు నమోదు ● విచారణలో విస్తుపోయే విషయాలు

అది ప్రైవేటు బడి.. మూతపడి నెలలు దాటింది. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి తెరుచుకోలేదు. టీచర్లు ఉండరు, నిర్వాహకులు కనిపించరు. విద్యార్థులు మాత్రం రోజూ హాజరవుతున్నారు మరి.. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది నిజంగా నిజం. అలాంటి ఉత్తుత్తి బడి తలుపులలో ఉంది. నెలల క్రితం మూతపడిన ఆ పాఠశాలకు రోజూ విద్యార్థులు వస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అధికారుల విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ విద్యార్థులు.. కదిరిలోని ఓ అనధికార ప్రైవేటు హాస్టల్‌లో నవోదయ, సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నట్లు తేలింది.



తలుపులలో మూతబడిన ఎస్ఎంఎంఎస్ పాఠశాల

కదిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అంటే విద్యార్థులు, టీచర్లు ఉంటారు. ప్రైవేటు పాఠశాల అయితే యాజమాన్య ప్రతినిధులు కూడా ఉంటారు. రోజూ అందరూ హాజరవుతారు. తలుపులలో మాత్రం ఉత్తుత్తి బడి నడుస్తోంది. అధికారులు మాత్రం రోజూ విద్యార్థులు హాజరైనట్లు నమోదు చేస్తారు. పాఠశాల మాత్రం ఆరు నెలలుగా మూత వేసి ఉంది. అక్కడ విద్యార్థులు కనిపించరు. టీచర్లు, యాజమాన్య ప్రతినిధులు ఎవ్వరూ ఉండరు. అధికారులు తనిఖీలు కూడా చేయరు. ఏమీలేకున్నా, అన్నీ ఉన్నట్లు రికార్డులు సృష్టించి, విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు. అదే తలుపులలోని ఎస్ఎంఎంఎస్ పాఠశాల. ఒకప్పుడు మండలకేంద్రంలో ఇదొక్కటే ప్రైవేటు పాఠశాల (మిగతా 7లో)

సహజీవనం జంట హల్‌చల్

అడ్డుకున్న స్థానికులు.. వన్‌టౌన్‌కు చేరిన పంచాయితీ

అనంతపురం క్రైం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఉంటూ సహజీవనం చేస్తున్న ఓ జంట నగరంలో ఆదివారం రాత్రి గొడవ పడి హల్‌చల్ చేసింది. రోడ్డుపై గొడవ పడుతుండటంతో స్థానికులు యువతిని కిడ్నాప్ చేస్తున్నారనుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ పంచాయితీ వన్‌టౌన్ స్టేషన్‌కు చేరింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 20 ఏళ్ల ఓ యువతి బెంగళూరులోని ఓ పబ్‌లో పనిచేస్తోంది. కదిరికి చెందిన 30 ఏళ్ల యువకుడికి ఆమె పబ్‌లో పరిచయమైంది. ఇరువురు 9 నెలలుగా సహజీవనం చేస్తున్నారు. బెంగళూరు నుంచీ హైదరాబాద్ కారులో వెళుతూ.. అనంతపురంలో దిగారు. బస్టాండు వద్ద గల ఓ హోటల్‌లో రూమ్ తీసుకున్నారు. తర్వాత ఏమైందో తెలియదు కానీ.. ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. శ్రీకంఠం సర్కిల్‌లో గొడవపడుతూ... ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. హిందీలో తిట్టుకుంటూ గొడవ పడుతుండటంతో స్థానికులు కిడ్నాప్ అనుకున్నారు. స్థానికులు అడ్డుకోవడంతోపాటు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువతీయువకుడిని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

క్రైం కార్నర్

పెళ్లయిన ఆరు నెలలకే..

● రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం


శ్రీధర్ మృతదేహం

సోమందేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివాహ బంధంలోకి అడుగిడిన ఆ యువకుడు.. కన్న కలలు తీరకుండానే కన్ను మూశాడు. తమ కొడుకుకు మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చిందని ఆశించిన తల్లిదండ్రుల కలలు చెదిరిపోయాయి. చేతికొచ్చిన కొడుకు విగత జీవుడు కావడంతో పుత్రశోకంతో తల్లడిల్లిపోయారు. కొడుకు, కోడలు ఇంట్లో కలియ తిరుగుతుంటే చూసిన క్షణాలు ఇంకా మరువక ముందే.. ఇక తమ బిడ్డలేడని జీర్ణించుకోలేకపోతున్నారు. సోమందేపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వెనుక శనివారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో గాజుల శ్రీధర్(32) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన గాజుల శ్రీధర్ బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆరునెలల క్రితం పుట్టపర్తికి చెందిన సాయివినితతో వివాహమయింది. శనివారం అర్ధరాత్రి బెంగళూరు నుంచి బయలుదేరి స్నేహితులతో కలిసి పుట్టపర్తికి వెళ్తుండగా కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో అతను మరణించారు. కారులో స్నేహితులు నాగరాజు, వెంకటేశ్, చంద్ర ఉండగా.. నాగరాజు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పెనుకొండ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. గాజుల శ్రీధర్ మృతితో ఇరుకుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆసుపత్రివద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. భార్య సాయివినితను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఈ సంఘటన అందరినీ కలిచివేసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరో ఇద్దరి మృతి


రామలక్ష్మమ్మ (ఫైల్)

ముదిగుబ్బ, నవంబరు, 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఆదివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరో ఇద్దరు మృతిచెందారు. ముదిగుబ్బ మండల పరిధిలోని రాళ్లఅనంతపురం క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈదులపల్లికి చెందిన మహిళ మృతి చెందారని ముదిగుబ్బ సీఐ శివరాముడు పేర్కొన్నారు. సీఐ వివరాల మేరకు.. ఈదులపల్లికి చెందిన రామలక్ష్మమ్మ(72) పెద్ద కుమారుడు ఓబులపతితో కలిసి తమ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో ధర్మవరం మండలం బిల్వంపల్లికి బయలుదేరింది. రాళ్ల అనంతపురం సమీపంలో ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతుండగా కదిరి వైపు నుంచి అనంతపురం వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొనడంతో రామలక్ష్మమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు ఓబులపతికి తీవ్ర గాయాలు కావడంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

చోళసముద్రంలో రైతు..


పర్వతయ్య (ఫైల్)

కూడేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చోళసముద్రం గ్రామానికి చెందిన పర్వతయ్య (54) అనే రైతు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెండున్నర ఎకరాల పొలంలో వేరుశనగ సాగు చేయడానికి అవసరమైన విత్తనాలను ఆమిద్యాల గ్రామంలో ఆదివారం పర్వతయ్య కొనుగోలు చేశాడు. విత్తనాలను ఆటోలో చోళసముద్రం గ్రామానికి తరలిస్తుండగా.. కొర్రకోడు గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఆటోలో కూర్చున్న పర్వతయ్యను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేటు వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు తిమ్మరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బంజారాల హక్కుల కోసం పోరాడుదాం

● ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రే నాయక్


అభివాదం చేస్తున్న ఏఐబీఎస్ఎస్ నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంజారాల హక్కుల సాధనతోపాటు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుదామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్(ఏఐబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ చక్రే నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏఐబీఎస్ఎస్ జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభ నిర్వహించారు. అంతకుముందు పీటీసీ నుంచి క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేడ్కర్ భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సభలో చక్రేనాయక్ మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 సంవత్సరాలవుతున్నా బంజారాల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. ఇప్పటికే రోడ్లు, నీరు, బస్సు, సెల్‌టవర్, వైద్యసేవలు అందని తండాలు ఉన్నాయని తెలిపారు.

కమిటీ ఎన్నిక: సమావేశంలో భాగంగా ఏఐబీఎస్ఎస్ అనంతపురం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రవీంద్రనాయక్, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాములు నాయక్, కోశాధికారిగా నారాయణనాయక్, గౌరవ సలహాదారులుగా అశ్వర్థనాయక్, బా లా నాయక్, ఠాగూర్ నాయక్, బాబూ నాయక్, కోఆర్డినేటర్‌గా రంగ్లా నాయక్, ఉపాధ్యక్షులుగా గోపాల్ నాయక్, అశోక్ నాయక్, సూ ర్య నాయక్, తారాచంద్రనాయక్, నాగరాజు, రవినాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ప్రసాద్ నాయక్, తిరుపాల్ నాయక్‌ను ఎన్నుకున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా శివమ్మబాయి, ప్రధాన కార్యదర్శిగా పద్మాబాయి, సహాయ కార్యదర్శిగా కాంతమ్మబాయి, ప్రచార కార్యదర్శిగా బన్సీలాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడిగా ఆంజనేయులు నాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటనాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పరమేష్ నాయక్‌తో కలిపి మొత్తం 55 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర నాయకుల సమక్షంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది.

నీళ్లలో చేలు..!

(5వ పేజీ తరువాయి)

బ్యాక్‌వాటర్ పరిహారం చెల్లించని భూముల్లో పంటలను ముంచెత్తుతోంది. ఇప్పటికే వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఆయా భూముల్లో సాగుచేసిన దానిమ్మ, గుమ్మడి, టమోటా, కంది, ఆముదం, వరి, చీనీ, వేరుశనగ తదితర పంటలు నీటిలో మునిగిపోయాయి. దీంతో అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో పరిహారం చెల్లిస్తామంటూ చెప్పిన పాలకులు.. నివేదికలు తీసుకుని మొండిచేయి చూపారు. దీంతో రైతులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. పరిహారం చెల్లించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

3,026 ఎకరాల సేకరణకు నివేదికలు

పీఏబీఆర్‌కు సేకరించని భూమిలోకి బ్యాక్‌వాటర్ చేరుతోంది. దీంతో సమస్యను రైతులు.. నీటి పారుదల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరింత భూమి సేకరించాలని నిర్ణయించారు. 2024లో 3,026 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అందుకు రూ.405 కోట్లు పరిహారం చెల్లించాలని డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ పేర్కొన్నారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతోంది. కుడికాలువ గేటు తెరుచుకోలేదు. దీంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక నీటి నిల్వ ఐదు టీఎంసీలు దాటిపోయింది. దీంతో బ్యాక్‌వాటర్ వందల ఎకరాల్లో భూములను ముంచెత్తింది.


నీటితో నిండిన వరి పంటను చూపుతున్న మహిళా రైతు వెంకటలక్ష్మి

డ్యాం నీటిలో దానిమ్మ చెట్లు



జయపురం గ్రామ సమీపంలో ఐదెకరాలు కౌలుకు తీసుకుని, లక్షలు ఖర్చుచేసి దానిమ్మ సాగు చేస్తున్నాం. ప్రస్తుతం చెట్లు పూత దశలో ఉన్నాయి. పీఏబీఆర్ బ్యాక్ వాటర్ పొలంలోకి చేరింది. నేల తడిబారిపోయి పూత రాలిపోతోంది. రూ.4 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి పంట సాగుచేస్తే పూర్తిగా నష్టపోతున్నా. పంటకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావట్లేదు.

-రామాంజనేయులు, కౌలు రైతు, కడదరకుంట గ్రామం

నీటిలోనే వేరుశనగ, వరి పంటలు



2.50 ఎకరాల్లో అప్పులు చేసి బోరు వేయగా.. నీరు పడింది. ఈ ఏడాది ఎకరాలో టమోటా, ఎకరాన్నరలో వేరుశనగ, వరి పంటలు పెట్టాం. రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టాం. వరి కోత దశకు చేరింది. పొలాన్ని నీరు ముంచెత్తింది. తిండిగింజల కోసం నాటుకున్న వరి నీటిలో మునగగా.. టమోటా కుళ్లిపోయింది. వేరుశగన పూర్తిగా మునిగిపోయింది.

- వెంకటలక్ష్మి, మహిళారైతు, జయపురం

టమోటా పైరు మునిగింది



మూడెకరాల్లో టమోటా సాగుచేశారు. రూ.లక్ష అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టా. ప్రస్తుతం కాయ దశలో ఉంది. పీఏబీఆర్‌లో నీరు ఎక్కువగా నిల్వ చేయడంతో బ్యాక్ వాటర్ టమోటా పంటను ముంచేసింది. బోరులో వేసిన మోటారు, పంటకు వేసిన డ్రిప్ సామగ్రి మునిగిపోయాయి. మోటారు బయటకు తెచ్చుకునేందుకు కూడా అవకాశం లేదు.

-సాకే నారాయణ, రైతు, జయపురం గ్రామం

ఆ పోలీసులకు మళ్లీ అవకాశం...!

● నాడు గళం విప్పిన ప్రకాష్‌పై జగన్ ప్రభుత్వం వేటు
● నేడు రిపోర్ట్ చేసుకోవాలన్న ఎస్పీ జగదీష్
● మరో ముగ్గురు కానిస్టేబుళ్లకూ అవకాశం

అనంతపురం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పోలీసులకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పిన ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్‌ను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. గత ప్రభుత్వంలో ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్ పోలీసుల బకాయిల విడుదలలో అన్యాయం జరుగుతోందంటూ గళం విప్పారు. దీంతో అప్పటి ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టింది. ఆయనను విధుల నుంచి తొలగించింది. 'సీఎం జగన్ సర్... సేవ్ ఏపీ పోలీస్' పేరుతో మూడేళ్ల కిందట పోలీసు అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పోలీసులకు అరియర్లు ఇవ్వాలని కోరారు. ఇది నచ్చని అప్పటి జగన్ ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టింది. ఆయనను విధుల నుంచి తొలగించింది. అప్పటి నుంచి ఆయన పోరాటం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన ప్రభుత్వానికి పిటీషన్ పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలంటూ డీజీపీ కార్యాలయం నుంచి ఎస్పీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆయనను విధుల్లోకి తీసుకునేలా శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో ప్రకాష్ ఎస్పీ వద్ద రిపోర్ట్ చేసుకోనున్నారు.

మరో ముగ్గురుకి అవకాశం...

పలు ఆరోపణలతో సర్వీస్ నుంచి డిస్మిస్ అయిన మరో ముగ్గురు పోలీసులకు మళ్లీ అవకాశం కల్పించారు. సర్వీస్ నుంచి తొలగించిన వారికి మళ్లీ ప్రభుత్వ ఆదేశాలతో అవకాశం కల్పించారు. పోలీస్ కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, నాగరాజు, ఎన్‌వీ రమణ సర్వీసును రీ-ఇన్‌స్టేటెడ్ చేస్తూ... ఎస్పీ జగదీష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా వారికి పోస్టింగ్ కూడా ఇచ్చారు.

కవులు.. చైతన్య వారధులుగా నిలవాలి

● ఎస్కేయూ రిటైర్డ్ వీసీ ఆచార్య రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న ఆచార్య రామకృష్ణారెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ సమాజ చైతన్యం కోసం కవులు వారధులుగా నిలవాలని ఎస్కేయూ విశ్రాంత వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక, డల్లాస్ ఏరియా రాయలసీమ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ మహా కవిసమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాయలసీమ నేల చారిత్రక, సాంస్కృతిక నెలవైనదని, భావితరాలకు ఆ వారసత్వ స్ఫూర్తిని కవులు సమాజానికి అందించాలని కోరారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి హాజరైన దాదాపు 180 మంది కవులు తమ కవితాగానం వినిపించారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, రచయితలు శాంతినారాయణ, ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబరరెడ్డి, విశ్రాంత ఆచార్యులు లక్ష్మీనారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి, మానవతా అమర్నాథరెడ్డి, రైతుసంఘం శ్రీనివాసరెడ్డి, సీమ ప్రజాసంఘాల నాయకులు వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అనంత జట్లు అదుర్స్


విజేత అనంత బాలుర జట్టుకు షీల్డ్ అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా జట్లు అదరగొట్టాయి. అనంత బాలికలు అండర్-14, అండర్-19 రెండు విభాగాల్లోనూ చాంపియన్లుగా అవతరించారు. అనంత బాలురు అండర్-14లో విజేతలుగా నిలిచారు. అండర్-19లో చిత్తూరు జట్టు చాంపియన్‌గా అవతరించింది. మండలంలోని చిగిచెర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి అనంత జట్లు తిరుగులేని ఆధిపత్యం చెలాయించాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. విజేత జట్లకు షీల్డులు, పతకాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 600 మంది క్రీడాకారులకు పరిటాల రవీంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో టీషర్టులను పరిటాల శ్రీరామ్ అందజేశారు. విజేత జట్లకు చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో ముందుకు వెళితే విజయం సాధించవచ్చన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, ఏపీ సీడాప్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి, సింగిల్ విండో అధ్యక్షుడు మేకల రామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ఆటవిడుపు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల ఆటవిడుపు ఆసక్తిగా మారింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం అనంతపురం రెవెన్యూ టీం, పుట్టపర్తి జిల్లా పోలీసు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో అనంతపురం కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాటామంతి కలిపారు. అనంతరం టాస్ వేసి, మ్యాచ్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పుట్టపర్తి పోలీసు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. నాగేంద్రప్రసాద్ (31), ప్రభాకర్ (20), ఎస్పీ సతీష్‌కుమార్ (8బంతుల్లో 12), డీఎస్పీ మహేష్ (17) రాణించారు. అనంతపురం బౌలర్ ఓబులేసు 4వికెట్లు తీశారు. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం 17.5 ఓవర్లలో 95 పరుగులకు ఆలౌటైంది. రవితేజ (17), కలెక్టర్ ఆనంద్ (12బంతుల్లో 9) రాణించారు. శ్రీసత్యసాయి ఎస్పీ సతీష్‌కుమార్ 4 వికెట్లు, వీరూ నాయక్, శివ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా పోలీసు జట్టు 35 పరుగుల తేడాతో విజయం సాధించింది.

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

● రేపు గంధంపూజ
● సర్వమత సమ్మేళనానికి హాజరుకానున్న ప్రముఖులు


బాబయ్యస్వామి దర్గా ముఖద్వారం

పెనుకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ బాబయ్యస్వామి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. హిందూ ముస్లిం ఐక్యతకు చిహ్నం. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ దర్గాలలో ఇదొకటి. పెనుకొండ పట్టణంలో వెలసిన ఈ దర్గాలో ప్రతి సంవత్సరం ఉరుసు నిర్వహిస్తారు. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుంటారు. స్వామివారి 753వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ప్రధానమైన గంధం పూజ మహోత్సవం ఈనెల 2న నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా, మాజీ పీఠాధిపతి తాజ్‌బాబా తెలిపారు. 3న దీపారాధన, 4న ఫకీర్ల ప్రదర్శన, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. గంధం పూజ నిర్వహించే రోజు రాత్రి 9 గంటల నుంచి సర్వమత సమ్మేళనం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తరుపున బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చేతులమీదుగా చాదర్ సమర్పిస్తారని వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ముఖ్య అతిథులుగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూక్, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు షరీఫ్ మహ్మద్ అహ్మద్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, ఏపీరాష్ట్ర ముతువల్లిల సంక్షేమ సంఘం అధ్యక్షులు షకీల్ షఫీ, కలెక్టర్ శ్యామ్ సుందర్, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు హాజరవుతారని వివరించారు.

టెట్ నుంచి మినహాయించాలి

● యూటీఎఫ్ నాయకుల డిమాండ్


కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని యూటీఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలోపు టెట్ అర్హత సాధించాలని, అలా కానిపక్షంలో వారిని సర్వీసు నుంచి తొలగించాలని విద్యాహక్కు చట్టంలోని క్లాజ్ 2(1) ప్రకారం సుప్రీంకోర్టు సెప్టెంబరు 1న తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ తీర్పు వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం టెట్ పరీక్షను 2011 నుంచి తప్పనిసరి చేశారని అన్నారు. అప్పటి నుంచి టీచర్ వృత్తిని పొందడానికి అభ్యర్థులు టెట్ పరీక్షల్లో అర్హత సాధించి ఉపాధ్యాయులుగా నియమితులవుతున్నారని తెలిపారు. 2011 కంటే ముందు నియమితులై 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా వర్తింపచేసేలా తీర్పు రావడం అందరినీ మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తోందన్నారు. దీనిపై యూటీఎఫ్ పోరాటాలకు సిద్ధమవుతోందని తెలిపారు. డిసెంబరు 9,10తేదీల్లో డివిజన్ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, 18న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, జనవరి 4న భీమవరంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో భారీ ర్యాలీ, జనవరి 29న చలో పార్లమెంటు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, చంద్రశేఖర్, సురేశ్, సాయిగణేశ్, వెంకటకిశోర్, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తుత్తి బడి..!

(5వ పేజీ తరువాయి) ఉండేది. యాజమాన్యం మారడం, విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఆరునెలలుగా మూత వేశారు. అయినా.. 32 మంది విద్యార్థులు చదువుతున్నట్లు రికార్డులు చూపుతున్నారు. ఆ విద్యార్థులంతా పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నవోదయ, సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు.

అనుమతులు లేకుండా హాస్టల్..

కదిరిలోని కేఎల్ఎన్ పాఠశాలలో అనధికారికంగా హాస్టల్ నిర్వహిస్తూ, కోచింగ్ ఇస్తున్నట్లు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు.. ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. విషయం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి రావడంతో వెంటనే విచారణ చేయాల్సిందిగా మండల విద్యాధికారి (ఎంఈఓ) చెన్నక్రిష్ణను ఆదేశించారు. ఈనెల 26న ఆయన పాఠశాల తనిఖీకి వెళ్లగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు ఏకంగా తలుపుల మండలకేంద్రంలోని ఎస్ఎంఎంఎస్‌లో చదువుకుంటున్నట్లు అడ్మిషన్లు చేశారు. విషయాన్ని స్వయంగా కేఎస్ఎన్ పాఠశాల ప్రతినిధి.. ఎంఈఓ ముందు వెల్లడించారు. ఆరు నెలలుగా మూతబడిన పాఠశాలలో ఎలా చదువుకుంటున్నారో అర్థం కాని విషయం. తలుపులలో ఎస్ఎంఎంఎస్ పాఠశాల గురించి వివరాలు సేకరిస్తే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే మూతబడినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని తలుపుల ఎంఈఓ వెంకటరాముడు ధృవీకరించారు. మూతపడిన పాఠశాలకు రోజూ 32 మంది హాజరవుతున్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు.

స్వస్థలాలకు విద్యార్థులు

కేఎల్ఎన్ పాఠశాలలో అనధికారికంగా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌ను ఎంఈఓ చెన్నక్రిష్ణ మూత వేయించారు. అక్కడున్న విద్యార్థులను బస్సుల్లో ఇళ్లకు పంపించారు. అనుమతిలేకుండా కోచింగ్ సెంటర్ నడుపుతున్న కేఎల్ఎన్ పాఠశాల నిర్వాహకుడు రమేష్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఓకి నివేదికలు పంపుతున్నట్లు చెప్పారు. ఉత్తుత్తి బడిని సృష్టించిన నిర్వాహకులు, పర్యవేక్షించని మండల విద్యాధికారులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

విచారించి, చర్యలు తీసుకుంటాం: కిష్టప్ప, జిల్లా విద్యాశాఖాధికారి

పాఠశాల మూతపడినట్లు నా దృష్టికి రాలేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి, చర్యలు తీసుకుంటాం.

పంచాయతీల విభజనకు గ్రీన్‌సిగ్నల్

● పునర్ వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేత
● జీఓ విడుదల
● మార్పులకు అవకాశం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల విభజన, మార్పులు, చేర్పులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటి వరకు ఉన్న నిషేధాన్ని ఎత్తి వేస్తూ.. గురువారం జీఓ ఎంఎస్ నెంబర్ 97 జారీ చేసింది. దీంతో పంచాయతీల్లో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని స్థానిక అధికారులు తయారుచేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభించే అవకాశం ఉంది. పునర్వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేయడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దీని ద్వారా మార్పులకు అవకాశం కలుగుతోంది. పలు పంచాయతీల నుంచి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. నిషేధం కారణంగా పెండింగ్‌లో ఉన్నవాటిని విభజించే అవకాశం ఉంది. దీంతో పాటు స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా, అధికారులు ప్రతిపాదనలు పంపి మార్పులు చేర్పులు చేసుకొనే వెసులుబాటు ఉంది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఏ చిన్న పనికయినా పంచాయతీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. కొన్ని పంచాయతీ కేంద్రాలకు చుట్టేసుకుని 30 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అభివృద్ధికి సంబంధించి తగిన విధంగా నిధులు కేటాయింపు లేక కొన్ని మజరా గ్రామాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. దీంతో అవకాశం ఉన్న వాటిని పంచాయతీలుగా చేయడం ద్వారా స్థానిక ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. పంచాయతీలకు కేటాయించే నిధుల ద్వారా అభివృద్ధికి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తమ పంచాయతీలను విభజించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిషేధం ఎత్తివేయడం ద్వారా మరిన్ని ప్రాంతాల నుంచి విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడానికి సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్నింటిని పరిశీలిలిస్తే..

● అనంతపురం రూరల్ మండలంలో ఉన్న ఐదు పంచాయతీలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో నారాయణపురం, రాజీవ్‌కాలనీ, కక్కలపల్లి కాలనీ, రుద్రంపేటతో పాటు అనంతపురం రూరల్ గ్రామ పంచాయతీని మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. కార్పొరేషన్‌లో విలీనం కావడం ద్వారా అభివృద్ధికి పెద్ద పీట వేసే అవకాశం ఉంది.

● బెళుగుప్ప మండల కేంద్రం నుంచి బెళుగుప్ప తండాను వేరు చేసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి.

● నార్పల మండలం కేసేపల్లి పంచాయతీలో కూరగానపల్లిని ప్రత్యేక పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు పంపించారు.

● పామిడి మండలం వంకరాజుకాలువ పంచాయతీలో నేమలపల్లి గ్రామం ఉంది. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా నేమలపల్లిని ప్రత్యేక పంచాయతీ చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి.

● తలుపుల మండలం వేపమానిపేట పంచాయతీలో ఉన్న గంజివారిపల్లిని విభజించి.. నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ద్వారా ఇప్పటికే జిల్లా అధికారులకు విన్నవించారు.

● కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి పంచాయతీ పరిధిలోని మీటేనాయక్ తండా, బోడేనాయక్ తండా, రాందాస్ నాయక్ తండాలను కలిపి ప్రత్యేక పంచాయతీ చేయాలన్న ప్రతిపాదన ఉంది.

జీఓ విడుదలతో మార్గం సుగుమం

పరిపాలనా సౌలభ్యం, గ్రామీణ ప్రజల అవసరాల దృష్ట్యా అవసరమైన పంచాయతీలను విభజన చేయడానికి అవకాశం ఏర్పడింది. ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. మరికొన్ని కలెక్టర్ల వద్దనే ఉండిపోయాయి. నిషేధం ఎత్తివేత కారణంగా వీటన్నింటికి జీవం పోసినట్లయింది. ప్రభుత్వం దృష్టిలో ఉన్న వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకొనే వెసులుబాటు కల్పించారు. ప్రధానంగా తలుపుల మండలంలోని వేపమానిపేట పంచాయతీకి వెళ్లాలంటే.. గంజివారిపల్లి పరిసర ప్రాంతాల వారు దాదాపు 28 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. చాలా ఇబ్బందిగా ఉందని స్థానికులు పార్టీలకు అతీతంగా అధికారులకు, ఇటు పాలకులకు వినతులు ఇచ్చారు. అదే తరహాలో ఎర్రదొడ్డికి సంబంధించి తండాలన్నింటిని కలిపి ఒక పంచాయితీగా చేయడం ద్వారా ఆయా తండాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాల ప్రజలు ప్రత్యేక పంచాయతీలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అందుకు అనుగుణంగా స్థానిక నాయకులు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన నిషేధం ఎత్తివేత వెసులుబాటును సద్వినియోగం చేసుకొని న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

నేడు ఆంధ్ర, కర్ణాటక మ్యాచ్ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19లో భాగంగా అనంత క్రీడా గ్రామంలో రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం ఆంధ్రా, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆదివారం ఇరు జట్ల ఆటగాళ్లు ఫిట్‌నెస్, ఫీల్డింగ్, బౌలింగ్, బ్యాటింగ్‌పై ప్రాక్టీస్ చేశారు. మ్యాచ్ అఫీషియల్స్ రెఫరీ మోమిత చక్రబోర్తి, అంపైర్లు జైబి సంఘని, ప్రేమ్ ఎస్ భార్గవ్‌తో ఆంధ్రా కెప్టెన్ రాజేష్, మేనేజర్ కిరణ్, కర్ణాటక కెప్టెన్ అన్వయ్ డేవిడ్, మేనేజర్ సతీష్ మ్యాచ్ నిర్వహణపై చర్చించారు. నాలుగు రోజుల పాటు జరిగే మ్యాచ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30గంటల వరకు మ్యాచ్ సాగనుంది.

జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

శింగనమల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఏఎస్ఆర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి ఎం.హర్షనవనీత్‌రెడ్డి జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపాడు. అనంతపురంలో ఆదివారం అనంత ఇంగ్లిష్ మీడియం స్కూల్, విశ్వం ఎడ్యుటెక్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అబాకస్ పోటీలు జరిగాయి. ఇందులో సీనియర్ లెవల్-3, సీనియర్ లెవల్ విజువలైజేషన్ విభాగాలు రెండింటిలోనూ హర్ష నవనీత్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి లెవల్‌లో చాంపియన్ షిప్ సాధించాడు. దీంతో విద్యార్థికి హెచ్‌ఎం ఆంజనేయరెడ్డి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

శ్రీనివాసులు నాయక్ నియామకం



శ్రీనివాసులు నాయక్

అనంతపురంక్లాక్‌టవర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజాసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జీపీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గర్భా మల్లికార్జున నాయక్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు సేవ చేయడానికి తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీపీఎస్ఎస్ గౌరవసలహాదారులు నారాయణస్వామి నాయక్, కేశవనాయక్, ఎంపీఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సుదర్శన్, జీపీఎస్ఎస్ నాయకులు నాగేంద్రనాయక్, ఓబుళపతి, రాకేష్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రైతు

చెన్నేకొత్తపల్లి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల గ్రామంలో భూవివాదంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే రైతుకు తల్లి వెంకటలక్ష్మమ్మ పేరు మీద నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన మరో రైతు ఆదినారాయణ అందులో ఎకరా 40 సెంట్ల భూమిని తన పేరు మీద చేయించుకున్నాడు. ఈ వివాదం కోర్టులో నడుస్తోంది. కాగా ఆదినారాయణ ఆదివారం పొలంలోకి వెళ్లి సేద్యం చేస్తుండగా, ఇది కోర్టులో ఉందని భూమిలోకి ఎలా వస్తావని సుబ్రమణ్యం అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహించిన ఆదినారాయణ సుబ్రమణ్యంను దుర్భాషలాడాడు. మనస్థాపం చెందిన అతను పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'ఐక్యంగా పోరాడుదాం'

అనంతపురం విద్య, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గం ఐక్య పోరాటాలతోనే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నియంత విధానాలను తిప్పికొడదామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రవీంద్రనాథ్ హాజరై మాట్లాడారు. రైతు, కార్మిక వర్గాలను దెబ్బతీయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మండిపడ్డారు. అందులో భాగంగానే కార్మికులకు రక్షణగా ఉన్న 29కార్మికచట్టాలను తొలగించి నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చాయన్నారు. అందుకే ఏఐటీయూసీ దేశవ్యాప్త ఉద్యమాలకు పూనుకుందన్నారు. ఇలాంటి ప్రభుత్వ నియంతవిధానాలను తిప్పికొట్టడానికి కార్మికుల ఐక్యతగా సాగుతూ పోరాడడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లపై పోరాటాలకు అన్ని సంఘాలతో సమావేశమైన తర్వాత గుంతకల్లులో మార్చిలో ఏఐటీయూసీ మహాసభలను నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్,నాయకులు కృష్ణుడు, చిరంజీవి, రాజు, గోవిందు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.39లక్షలు

అనంతపురంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ.3,39,200 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.93 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1.45 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు.

పెంచలయ్య హత్య నిందితులను అరెస్టు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గత శుక్రవారం నెల్లూరులో గంజాయి మాఫియా చేతుల్లో పెంచలయ్య హత్యకు గురి కావడాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని నీలిమా సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... రాష్ట్రంలో విచ్చలవిడి గంజాయి, మద్యం వల్ల యువత మత్తుకు బానిసవుతున్నారన్నారు. నెల్లూరు రూరల్ మండలంలో పెద్దఎత్తున గంజాయి మాఫియా అరాచకాలను, వాటివల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు పాటల ద్వారా ప్రచారం చేస్తున్న పెంచలయ్యను అత్యంత కిరాతకంగా హత్య చేయడాన్ని సీపీఎం ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తమ హామీలు నెరవేర్చాలన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించడంతోపాటు పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు నిర్మల, రామాంజనేయులు, వెంకటనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దాడులు చేస్తే.. పోలీసులు ఉపేక్షించరు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవ్
- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరిక
- 34 మందికి రూ.23.08 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఇష్టారాజ్యంగా దాడులు చేస్తే... పోలీసులు ఉపేక్షించరని, కూటమి ప్రభుత్వంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారయినా, ఏ పార్టీ వారయినా చర్యలు తప్పవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ నియోజకవర్గంలో 34 మందికి రూ. 23.08 లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరవగా.. అందుకు సంబంధించిన చెక్కులను ఆయన ఆయా లబ్ధిదారులకు అందజేశారు. తర్వాత మాట్లాడుతూ... నగరంలో వైసీపీ నాయకులు గత కొన్ని రోజులుగా ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎవరు ఎక్కడ గొడవలు పడినా...పోలీసులు ఉపేక్షించరన్నారు. ఇందులో భాగంగానే 3వ డివిజన్ వైసీపీ నాయకుడు కృష్ణమూర్తిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అనుచరుడు సత్యనారాయణరెడ్డి సాయినగర్‌లో ఆస్పత్రిపై దాడి చేస్తే....ఆయనను కూడా అరెస్టు చేశారన్నారు. తమ ప్రభుత్వంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే.. పార్టీలకతీతంగా చర్యలు ఎంతటివారైనా సరే పోలీసులు చర్యలు తీసుకుంటారని అన్నారు. నగర మేయర్ వసీం డమ్మీ అని, అతడి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని ఎద్దేవా చేశారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే దగ్గుపాటికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేష్, కడియాల కొండన్న, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లలిత్‌కుమార్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, మాజీ కార్పొరేటర్ రాజారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహ ఉండాలి

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహ ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. స్థానిక కమలానగర్‌లోని రఘువీరా టవర్స్ సెల్లార్‌లో టీడీపీ 15వ డివిజన్ ఇన్‌చార్జి విక్రమ్ సింగ్ రాజ్ పురోహిత్, శోభాశారీస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటైంది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు ఉపయోగపడేలా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. మన సంపాదనలో కొంత సమాజహితానికి ఖర్చు చేయడం గొప్పవిషయమన్నారు. ప్రతిఒక్కరిలోనూ ఇలా సామాజిక స్పృహ ఉండాలన్నారు. అనంతరం వైద్యులు ప్రజలకు గుండె, కంటి, దంత సంబంధిత పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా భక్త కనకదాస జయంతి





గార్లదిన్నెలో భక్త కనకదాస విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం , కృష్ణంరెడ్డి పల్లిలో..

గార్లదిన్నె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కురుబ కులస్థుల ఆరాధ్యుడైన భక్త కనకదాస జయంతి వేడుకలు మండలకేంద్రంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కురుబ సంఘం నాయకులు కనకదాస విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి ఆవులక్రిష్ణయ్య తదితరులు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి పూజించారు. అనంతరం మాట్లాడుతూ... వివిధ కులాలు ఉన్నప్పటికీ... మనుషులంతా ఒక్కటేనని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి భక్త కనకదాస అని తెలిపారు. ఆయన ఊరూరా తిరుగుతూ తన కీర్తన లు చేత ప్రజలను చైతన్య పరచారని చెప్పారు. కురుబలు విద్యావంతులుగా, రాజకీయంగా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. త ర్వాత కురుబ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. సాయంత్రం విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి డప్పు వాయిద్యాల మధ్య, బాణాసంచా కా ల్చుతూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కురుబ సంఘం నాయకులు ఈశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్ర, నాగేంద్ర, రామాంజి, రామలింగ, సంగప్ప, శేఖర్, శీనా, అజిత్, కిష్ట, రామకృష్ణ, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

- అనంతపురంరూరల్: మండలంలోని కృష్ణంరెడ్డిపల్లిలో గ్రామపెద్దలు, కురుబ కులస్థులు భక్త కనకదాస విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేశారు. బీరప్పలు డల్లులు కొడుతుండగా.. యువత కేరింతల నడుమ విగ్రహం ఊరేగింపు కోలాహలంగా సాగింది.
- శింగనమల: మండలంలోని సోదనపల్లిలో కురుబ కులస్థులు భక్త కనకదాస విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో విగ్రహాన్ని ఊరేగించారు. కురుబ సంఘం నాయకులు రాజహంస శ్రీనివాసులు, మంకెర నాగేంద్ర, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఈఈ సుధాకర్ రెడ్డికి ఘన సన్మానం



సుధాకర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే విభాగం ఈఈ సుధాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో నగర శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా చిత్తూరు జిల్లా రిటైర్డ్ కలెక్టర్ వెంకటరమణారెడ్డి, రిటైర్డ్ ఈఎన్‌సీలు రామారావు, నయీముల్లా, ఎస్ఈ సంజీవరాయుడు తదితరులు హాజరై సుధాకర్‌రెడ్డి దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి విధినిర్వహణలో నిరాడంబరంగా ఉండేవారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మురళీధర్, ఈఈ రాజగోపాల్‌తో పాటు సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ'

అనంతపురంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు 8977716661కు ఫోన్ చేసి సమస్యను తెలపవచ్చన్నారు. ప్రతి సోమవారం ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి

- ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీ పిలుపు




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న షకీల్ షఫీ తదితరులు

అనంతపురం టౌన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తెహరికె ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వతేదీ జిల్లా కేంద్రంలో రెండో రోడ్డులో గల బహవుద్దీన్ మస్జీద్ ఆవరణలో నిర్వహించనున్న సున్ని సదస్సును విజయవంతం చేయాలని ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బహవుద్దీన్ మస్జిద్‌లో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... సదస్సుకు కర్ణాటక రాష్ట్రం హుబ్బెళికి చెందిన హజరత్ అన్‌జార్ సాహెబ్, మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌కు చెందిన పఠాన్ జబల్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ముస్లింలు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెహరికె అధ్యక్షుడు హసన్ రజా, బహవుద్దీన్ మస్జీద్ ముతవల్లి ఫరీదుద్దీన్, కార్యదర్శి పర్వేష్, కోశాధికారి షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

షకీల్ షఫీ ఆర్థికసాయం..

ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం చేసి ఔదార్యం చాటుకున్నారు. ఈనెల 26న స్థానిక సైఫుల్లా బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కాసిఫ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాసిఫ్ తండ్రి మన్సూర్ క్లాక్‌టవర్ కూడలి వద్ద పూలవ్యాపారుల వద్ద కూలీగా పని చేస్తున్నాడు. కాసిఫ్‌కు ఆపరేషన్ కోసం రూ.5లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో కాసిఫ్ మిత్రబృందం షకీల్ షఫీని ఆశ్రయించారు. స్పందించిన ఆయన తనవంతుగా రూ.25వేల ఆర్థిక సాయం అందించారు.

భగవద్గీత పఠన పోటీలకు విశేష స్పందన



భగవద్గీతను పఠిస్తున్న విద్యార్థులు

అనంతపురం టౌన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): గీతాజయంతిని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పఠన పోటీలకు విశేష స్పందన లభించింది. చిన్మయా మిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు వందమంది విద్యార్థులు పాల్గొని భగవద్గీత పఠనం చేశారు. పోటీలకు రామకృష్ణారెడ్డి, పండిట్ వేణు, జీఎల్ఎన్ ప్రసాద్, నాగశయన, సునంద, కొండన్న న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతల్లో మొదటిస్థానంలో గెలుపొందినవారికి రూ.వెయ్యి, ద్వితీయ స్థానానికి రూ.750లు, తృతీయ స్థానానికి రూ.500 చొప్పున నగదు బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు బహూకరించారు. పలువురు చిన్నారులు శాస్త్రీయ నృత్యప్రదర్శనలతో అలరించారు. టీటీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబు, పండిట్ వరప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప విగ్రహ పునఃప్రతిష్ఠ

- కన్నుల పండువగా మహా పడిపూజ



ప్రతిష్ఠానంతరం దర్శనమిస్తున్న అయ్యప్పస్వామి

అనంతపురం టౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులో గల అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. తెల్లవారుజామున వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ స్వర్ణ కవచ సహిత అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయడంతో పాటు నాడీ సంధానం గావించి ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ మహాపడిని ప్రత్యేకంగా అలంకరించి, స్వామివారి ఉత్సవమూర్తిని ఆసీనులు గావించి మహా పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు స్వామి భక్తి గీతాలాపనలు చేశారు. తర్వాత భిక్ష ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ తారానాథ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు హరినాథరెడ్డి, ఉపాధ్యక్షులు నెట్టెం సూర్యనారాయణ, కేవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్ఐసీ సూర్యనారాయణ, కార్యదర్శి సివిల్ సప్లయ్స్ శ్రీనివాసులు, గురుస్వామి కుర్లపల్లి రంగాచారి పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో జాప్యాన్ని నివారించాలి

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య



మాట్లాడుతున్న జీవీ నరసయ్య

అనంతపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగోన్నతుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వీకే భవన్‌లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరేడేళ్లుగా ఆగిపోయిన ఉద్యోగోన్నతుల విషయంలో ఉద్యోగ సంఘాల పోరాటాలకు స్పందించి దీపావళి కానుకగా ముఖ్యమంత్రి, ఆర్టీసీ ఎండీ జీఓ ఇచ్చినప్పటికీ.. రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో ఇ ప్పటికీ అమలులో జాప్యం జరుగుతోందన్నారు. ఈ సమస్యపై అన్ని ఉద్యో గ సంఘాలతో చర్చించి, అర్హులైన ఉద్యోగులకు వెంటనే ఉద్యోగోన్నతులు ఇచ్చేలా చూడాలన్నారు. అనంతరం అనంతపురం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఈయూ జిల్లా కోశాధికారి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శు లు విజయభాస్కర్‌రెడ్డి, పీయస్ ఖాన్, జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్, నాయకులు కొండయ్య, శేఖర్, ఆంజనేయులు, గోపాల్, రత్నం, మల్లికార్జున, రామకృష్ణ, కల్లప్ప, లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ. 34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

పోస్టుమెన్‌కు సన్మానం

అనంతపురం అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సర్కిల్లో సర్ప్లస్ కోటా కింద పోస్టుమెన్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఏడుగురికి ఆదివారం ఘన సన్మానం జరిగింది. స్థానిక కళ్యాణదుర్గం బైపాస్‌లోని జార్జ్‌పేట తపాల కార్యాలయం వద్ద ఉద్యోగోన్నతి పొందిన సూర్యనారాయణరెడ్డి, శ్రీరాములు నాయక్, దేవరాజ ఆచారి, కుళ్లాయప్ప, పావని, సత్యమూర్తి, శివకుమార్‌ను తపాలా ఏఎస్పీ ఉమామహేశ్వర్, గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్ పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, నాగభూషణ, శ్రీనివాసులు, రామమోహన్‌రెడ్డి,రామమూర్తి, మధు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫొటోషాప్, ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ తదితర కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు శ్రీసాయి ఇన్‌స్టిట్యూట్ సంస్థ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి ఆదివారం ప్రకటనలో తెలిపారు. తమ ఇన్‌స్టిట్యూట్ 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 5వ తరగతి నుంచీ పీజీ విద్యార్థుల వరకూ, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులకు పైకోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు పేర్కొన్నారు. 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. దరకాస్తు చేసుకోవడానికి డిసెంబరు నెల 4వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు కమలానగర్‌లోని శ్రీసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషన్‌సొసైటీ కార్యాలయంలో కానీ, 9059723829ను కానీ సంప్రదించాలని సూచించారు.

ఉన్నత చదువులకు అవకాశం కల్పించండి

అనంతపురం విద్య, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఇన్‌సర్వీస్ టీచర్లకు బీఈడీ, ఇతర ఉన్నత కోర్సులు చదవడానికి అవకాశం కల్పించేందుకు కృషి చేయాలని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం వారు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ జిల్లాలో పాటు అనంతజిల్లాకు చెందిన దాదాపు 70మంది ఎస్సీఎస్టీ టీచర్లు ముందస్తుగా విద్యాశాఖ అనుమతి తీసుకోలేదన్నారు. దీంతో వారిని ఉన్నత చదువులు చదవడానికి తిరస్కరించారన్నారు. ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలియకపోవడం వల్లనే ఇలా జరిగిందన్నారు. దీంతో ఆ టీచర్లు బీఈడీ చేసుకోవడానికి అవకాశం లేక అయోమయంలో పడి మానసికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి ఎస్సీ, ఎస్టీటీచర్లకు ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు బండారు శంకర్, జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్‌కుమార్, నాయకులు నాగరాజు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండండి

అనంతపురంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) దిత్వా తుపాను పట్ల ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంస్థ సీఎండీ శివశంకర్ సూచించారు. ఆమేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. తుఫాన్‌తో భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే, సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం కురిసే సందర్భంలో విద్యుత్ వనియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ లైన్లు తెగిపోవడం, స్తంభాలు కూలిపోవడం లాంటి సంఘటనలు జరిగినట్లయితే వెంటనే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబరు1912, 18004251555333కు సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత

- స్వామి కరుణేశానందజీ మహరాజ్
- ముగిసిన రామకృష్ణ విశ్వజనీన ఆలయ ప్రారంభ వేడుకలు



అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామి కరుణేశానందజీ మహరాజ్

అనంతపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దైవారాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చెన్నై రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామి కరుణేశానందజీ మహరాజ్ పేర్కొన్నారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలో చేపట్టిన రామకృష్ణ విశ్వజనీన దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. గుత్తిరోడ్డులోని శ్రీ సెవెన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ముగింపు సభలో కరుణేశానందజీ మహరాజ్ అనుగ్రహభాషణం చేశారు. ఇటీవల కాలంలో పాశ్చాత్య పోకడలకు అలవాటు పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో సగటు మనిషి తన మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ తమకు వీలైన సమయంలో ఏదో ఒక ఆలయాన్ని సందర్శించి దైవారాధన చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన కలిగి మానసిక ప్రశాంతత లభిస్తుందని సూచించారు. కార్యక్రమంలో కేరళ కోజికోడ్ రామకృష్ణ మిషన్ ప్రతినిధి స్వామి అవతారానందజీ మహరాజ్, హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామి పూజానందజీ మహరాజ్, స్వామి ప్రతీతానందజీ మహరాజ్, అమిరపు నటరాజన్, రామకృష్ణ విశ్వజనీన ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీధర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నెట్టికంటి సేవలో ఎమ్మెల్యే


అర్చన చేయిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

గుంతకల్లుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామిని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామికి ఆకుపూజ చేయించారు. అర్చకులు స్వామి వారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి, ఆశీర్వదించారు.

హనుమాన్ మాలధారుల పాదయాత్ర


కసాపురానికి పాదయాత్రగా వెళ్తున్న మాలధారులు

యాడికి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): యాడికిలో 20 మంది హనుమాన్ మాలాధారులు కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారి దర్శనానికి ఆదివారం పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక చింతవనం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఏటా ఇలా పాదయాత్రగా వెళుతున్నట్లు గురుస్వామి బొట్టుశేఖర్ తెలిపారు.

గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ


గౌరమ్మదేవి, మారెమ్మదేవి

బొమ్మనహాళ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్టలో గ్రామ దేవతలు మారెమ్మ దేవి, గౌరమ్మ దేవి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం బలిహరణం, కూష్మాండ బలిదానం, కక్ష్యాజ్వాల గోదర్శనం, జయాది హోమం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు రవిచంద్రసాగర్ అన్నసంతర్పణం చేశారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, నాయకులు ఏర్రిస్వామి, తిప్పేస్వామి, బండారు మల్లికార్జున, అనిల్ పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం


దర్గాహొన్నూరు స్వామి

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాలలో దర్గాహొన్నూరు స్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి కర్రె నాగప్ప ఇంటి నుంచి దర్గా వరకూ మేళతాళాల మధ్య గంధం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా దత్త ఆశ్రమంలో పూజలు


ఆలంకరణలో శ్రీ దత్తాత్రేయ

బొమ్మనహాళ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్టలోని శ్రీదత్త ఆశ్రమంలో దత్త జయంతి మహోత్సవాలను మూడో రోజైనా ఆదివారమూ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు అభిషేకం, హోమాలు నిర్వహించారు. రాత్రి పల్లకి సేవ, భజనలు, నామ సంకీర్తనలు కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా భక్త కనకదాస జయంతి

రాయదుర్గంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరులో ఆదివారం కనకదాస జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మండపం ఏర్పాటు చేసి భక్త కనకదాస చిత్రపటాన్ని ప్రతిష్ఠించి.. పూజలు చేశారు. రాత్రి ట్రాక్టర్‌లో భక్త కనకదాస చిత్రపటాన్ని ఉంచి.. ఊరేగించారు.

నేటి నుంచి సూగేపల్లిలో జాతర

బ్రహ్మసముద్రం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగేపల్లిలో చన్నమల్లప్పస్వామి జాతరను సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మల్లికార్జునగౌడ ఆదివారం తెలిపారు. సోమవారం క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, గద్దెక పూజ నిర్వహిస్తామన్నారు.

తీరిన ట్రాఫిక్ సమస్య


ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

ఉరవకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పరిధిలో ఆక్రమణల తొలగింపుతో ట్రాఫిక్ సమస్య కొలిక్కి వచ్చింది. రోడ్లు, భవనాల వసతి గృహం నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆక్రమణల తొలగింపు తర్వాత ప్రధాన రహదారి విశాలంగా మారింది. గతంలో కూరగాయల వ్యాపారులు, తోపుడు బండ్ల వారు రోడ్డుపైనే ఏర్పాటు చేసుకుని, వ్యాపారం చేసుకునేవారు. దీంతో వాహనాల రాకపోకల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తేది. టవర్ క్లాక్ వద్ద ఉన్న తోపుడు బండ్లను పాత బస్టాండ్‌లోకి మార్చారు. ట్రాఫిక్ సమస్య తప్పడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి సమయంలో ఆక్రమణల తొలగింపునకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

అగ్రిగోల్డ్ ధర్నాకు తరలిరండి

రాయదుర్గంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై ఈనెల 3న విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాకు బాధితులు, ఏజెంట్లు తరలిరావాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, అగ్రిగోల్డ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రిస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు.

నేటి నుంచి అయ్యప్పలకు భిక్ష

కణేకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం నుంచి భిక్ష సౌకర్యాలన్ని కల్పిస్తున్నట్లు ఆలయ సమితి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రాపా ప్రకాష్ తెలిపారు. 41 రోజుల పాటు అయ్యప్ప, ఇతర మాలాధారులకు అన్న సంతర్పణం చేస్తున్నట్లు తెలిపారు.

లాభాలు కవర్..!

- కర్బూజా పంటకు కవర్లతో రక్ష
- తగ్గిన తెగుళ్లు, కీటకాల ముప్పు
- పెరిగిన దిగుబడి


కర్బూజా పంటపై కప్పిన కవర్

కూడేరు, నంబవరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అనేక మంది రైతులు గతంలో సాగుచేసిన కర్బూజా పంటకు కిటకాలు, తెగుళ్లు సోకాయి. పంటను కాపాడుకోవడానికి అనేక మందులు పిచికారి చేసినా.. ఫలితం లేకుండా పోయింది. అటు డబ్బులు పోయి.. ఇటు దిగుబడి రాక అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పంటను కిటకాలు, తెగుళ్ల నుంచి కాపాడటానికి చోళసముద్రం గ్రామానికి చెందిన రైతులు విశ్వనాథ్, నీలకంఠ వినూత్నంగా ఆలోచించారు. విశ్వనాథ్ మూడు ఎకరాలు, నీలకంఠ రెండు ఎకరాల్లో కర్బూజా పంటసాగు చేస్తున్నారు. పంటకు కిటకాలు, తెగుళ్లు సోకకుండా కవర్‌తో రక్షణ ఏర్పాటు చేశారు. విత్తనం నాటిన వెంటనే కడ్డీలు ఏర్పాటు చేసి మొక్కకు రక్షణగా క్రాఫ్ కవర్ ఏర్పాటు చేశారు. విత్తనం నాటిన నెల రోజులకు పూత దశకు చేరుకున్న తర్వాత క్రాఫ్ కవర్ తొలగించారు. దీంతో మందులు పిచికారి చేయడం తగ్గిపోవడంతోపాటు దిగుబడి బాగా వచ్చిందని ఆ రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎకరాకు దాదాపు రూ.లక్షకుపైగా ఖర్చు చేయాల్సి వస్తుండగా.. కవర్ల ఏర్పాటుతో రూ.75వేలు మాత్రమే ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు.

తలారి రంగయ్యా.. శవ రాజకీయాలు మానుకో..!

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్ హితవు


మీడియాతో మాట్లాడుతున్న వైపీ రమేష్

కళ్యాణదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్య శవ రాజకీయాలు చేస్తూ.. నీచ సంస్కృతికి కళ్యాణదుర్గంలో ఆజ్యం పోస్తున్నారని, అలాంటివి మానుకోవాలని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్ హితవు పలికారు. పట్టణానికి చెందిన శ్రావణి ఈ సంవత్సరం ఆగస్టు 14న ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో శ్రావణి తల్లిదండ్రులతో కలిసి వైపీ రమేష్ ఆదివారం తన స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శ్రావణి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమార్తె ఆత్మహత్యకు.. టీడీపీకి సంబంధమే లేదన్నారు. వైసీపీ నాయకులు వారి ఉనికిని కాపాడుకోవడానికి ఇలా నీచ.. శవ రాజకీయాలకు పాల్పడుతూ.. తమ పరువును బజారుకు ఇడుస్తూ, తమను మరింత మానసిక క్షోభకు గురిచేస్తున్నారని వాపోయారు. వైసీపీ నాయకులు ఇలా శవ రాజకీయాలు చేయడాన్ని మానాలని.. లేకుంటే వైసీపీ కార్యాలయం ఎదుట, లేకపోతే తలారి రంగయ్య ఇంటి ఎదుటే తామూ ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని మండిపడ్డారు. వైపీ రమేష్ మాట్లాడుతూ.. శ్రావణి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆర్థిక సాయం అందించారని, అండగా నిలుస్తానని భరోసా కూడా ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే అమిలినేని చేస్తున్న అభివృద్ధిని చూసి తలారి రంగయ్యకు మతి భ్రమించిందని, ఏమిచేయాలో తెలియక చివరికి ఇలా శవాలతో రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్ణాటకకు తరలుతున్న రేషన్ బియ్యం

డీలర్లు, వ్యాపారుల కుమ్మక్కు ● చోద్యంచూస్తున్న అధికారులు


ఆటోలో తరలిస్తున్న బియ్యం

విడపనకల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొందరు కొనుగోలు చేసి బహిరంగంగానే కర్ణాటకకు తరలిస్తున్నారు. కార్డుదారుల నుంచి కిలో బియ్యాన్ని రూ.12 నుంచి 14లకు కొనుగోలు చేసి.. అదే బియ్యాన్ని పక్క రాష్ట్రంలో రూ.28 నుంచి రూ.30లకు విక్రయిస్తున్నారు. ఆ బియ్యాన్ని కర్ణాటకలోని మిల్లుల్లో పాలిష్ చేసి వాటిని తిరిగి ఇతర రాష్ట్రాలకు తరలించి.. సొమ్ము చేసుకొంటున్నారు. దొంగలు.. దొంగలు ఊర్లు పంచుకున్నట్లు... రేషన్ బియ్యం మాఫియా సభ్యులు.. ప్రాంతాల వారీగా ఈ బియ్యం సేకరిస్తున్నారు. తమ ప్రాంతంలోకి ఎవరూ రాకూడదని ఆంక్షలు పెట్టుకున్నారు. బయటి వ్యక్తులు వచ్చి బియాన్ని కొనుగోలు చేయకుండా నిఘా ఉంచారు. రేషన్ మాఫీయా ఇంతగా మితిమీరి వ్యాపారం చేస్తున్నా.. రెవెన్యూ, విజిలెన్స్, పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలున్నాయి. కొన్ని రోజుల క్రితం పాల్తూరు గ్రామంలో ఓ లారీ బియ్యాన్ని, రెండు టాటా ఏస్‌లు, మూడు ఆటోలను కొంత మంది గ్రామస్థులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ రోజు మధ్యాహ్నం నుంచి రాత్రివరకూ అధికారులు అక్కడ కాపాలాగా ఉన్నారు. విషయాన్ని కొంత మంది పోలీస్ అధికారులు తెలుపగా వారు కూడా అక్కడికి చేరుకున్నారు. జిల్లా నుంచి కొంతమంది నాయకులు పోలీసులపై ఒత్తిడి చేయడంతో గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటకకు ఆ బియ్యాన్ని తరలించినట్లు సమాచారం. దీనిపై ఇన్‌చార్జి తాహసీల్దారు రమాదేవిని వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారణ చేసి రెవెన్యూ అధికారులు ఎవరు వెళ్లారు అనే విషయం జిల్లా అధికారులు వివరిస్తామన్నారు.

మండలంలో చిరుజల్లులు

యల్లనూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వ తుఫాన్ ప్రభావంతో మండలంలో ఆదివారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో కోతదశలో ఉన్న వరి రైతులు ధాన్యాన్ని కప్పుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ తుఫాన్‌తో పప్పుశనగ పొలాలు కూడా దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సీఈఓ మహేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తున్న బ్యాంక్ అధ్యక్షుడు

సీఈఓకు ఘన సన్మానం

గుత్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ది గుత్తికో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సీఈఓ మహేశ్వర ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక గుత్తిఆర్ఎస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. బ్యాంక్ అభివృద్ధికి ఆయన40 సంవత్సరాల పాటు చేసిన సేవలు ఎనలేనివని మాజీ ఎమ్మెల్యే మధుసూధన్ గుప్త, బ్యాంక్ చైర్మన్ అబ్దుల్ జిలాన్ కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్‌చైర్మన్ రామ్మోహన్, డైరెక్టర్లు మధుసూధన్ గుప్త, జక్కా వీరన్న, రామ్‌ప్రసాద్, నాగరాజు, మహేష్, బ్యాంక్ ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు ఉపాధ్యాయుల ఎంపిక


డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

గుంతకల్లుటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలకు ఎంపిక కోసం స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పోటీలను ఆదివారం నిర్వహించారు. డివిజన్ స్థాయి జట్టుకు పలువురిని ఎంపిక చేశారు. ఇందులో ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, పీడీలు రాజేష్, ప్రేమ్‌కుమార్, సంపత్‌కుమార్, విజయప్రతాప్ పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ


కరాటేలో ప్రతిభచాటిన విద్యార్థులు

గుంతకల్లుటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఆదివారం జరిగిన ఆల్ ఇండియా ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో పట్టణంలోని మాంటిసోరి పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. రెండో తరగతి విద్యార్థి లక్కీ, మూడో తరగతి విద్యార్థులు లక్షిత్, స్వాతిక్, నాలుగో తరగతి విద్యార్థి ఇషాన్, ఏడో తరగతి విద్యార్థులు హర్షిత్ రెడ్డి, మణికంఠ, ఆరీఫ్, లక్ష్మీనరసింహ ప్రతిభ చాటినట్లు కరాటే మాస్టర్ తలారి మల్లికార్జున తెలిపారు. వీరిని ఆ పాఠశాల యాజమాన్యం పూవ్వడి శ్రీనివాసులు, నాగార్జున, బండారు అనిల్, శంశీ కుమార్ అభినందించారు.

నేడు బూదగవిలో మంత్రి పర్యటన

ఉరవకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం పాల్గొంటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం నుంచి పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

- పుట్లూరు : కడవకల్లులో సోమవారం నిర్వహించే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొంటున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా శ్రీనివాసులు నాయుడు ఆదివారం తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



గుత్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఎస్ ఉన్నత పాఠశాలలో 1980-81 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 44 సంవత్సరాల తర్వాత ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. తరగతి గదులలో వెళ్లి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, దేశాయ్ నాగరాజు, రవి, సతీష్ రెడ్డి, శివ శంకర్ పాల్గొన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తుల వెల్లువ

యాడికి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇల్లు, స్థలాల కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఆదివారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, మొత్తం 1,815 దరఖాస్తులు వచ్చాయని హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్ తెలిపారు. స్థలం కలిగి ఉండి ఇంటి కోసం 659 దరఖాస్తులు, స్థలం, ఇంటి కోసం 1,156 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆవాస్ ప్లస్‌యాప్‌లో సర్వే చేసినట్లు తెలిపారు. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

- బెళుగుప్ప: మండలంలో ఇప్పటివరకు 1,560 మంది లబ్ధిదారుల ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారి గోపి నాయక్ ఆదివారం తెలిపారు. అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున తెలిపారు.



బెళుగుప్ప, యాడికిలో సర్వే నిర్వహిస్తున్న హౌసింగ్ ఏఈలు

క్రైం న్యూస్..

మహిళ ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన సుంకన్న భార్య రాములమ్మ (61) విష ద్రావకం తాగి శనివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఆమె పదేళ్లుగా షుగర్, కాళ్ల నొప్పులతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె శనివారం అర్ధరాత్రి విష ద్రావకం తాగి.. అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆమె మరణించింది. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాములమ్మకు భర్త, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యం

గుంతకల్లుటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ యువతి ఇడుపులపాయలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల రెండో తేదీన ఇడుపులపాయలోని కళాశాలకు వెళ్లిందని, అప్పటి నుంచి ఇంటికి రాలేదని ఆ యువతి తల్లిదండ్రులు కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టీపీ వెంకటస్వామి తెలిపారు.

ఆటో బోల్తా


బోల్తా పడిన ఆటో

రాయదుర్గంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులదట్ల గ్రామం వద్ద ఆదివారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్, డీ.హీరేహాళ్ మండలం మడేనహళ్లి వాసి సింహాద్రి గాయపడ్డాడు. కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు అతన్ని రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు బళ్లారికి రెఫర్ చేశారు.

వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ


డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం యానకల్లు గ్రామానికి చెందిన ఆనంద్ మరణంపై లేనిపోని పుకార్లు, నిరాధారమైన అవాస్తవాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. ఆదివారం స్థానిక తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఆనంద్ ఈ నెల 21న పట్టణ శివార్లలో ఉద్యోగం రాలేదని మనస్థాపంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నారని, పోలీసుల దర్యాప్తులో కూడా అదే విషయమే తేలిందని అన్నారు. ఉద్యోగం రాలేదనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఆనంద్ తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. తమ కుమారుడిపై అనుమానాలు వున్నాయని వారు అనుమానం వ్యక్తం చేయడంతో మళ్లీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేశామని, ఎటువంటి అనుమానాలూ లేవని స్పష్టం చేశారు. ఇకపై ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

18 మంది జూదరుల అరెస్టు

గుత్తిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామశివారులో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. 18 మందిని అరెస్టు చేసి.. వారి నుంచి రూ. 42,230 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామారావు, ఎస్ ఐ సురేష్ తెలిపారు.

మద్యం విక్రేతల అరెస్ట్

యాడికి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): యాడికిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం అరెస్ట్ చేశామని, వారి వద్ద ఉన్న 45 క్వార్టర్ మద్యం బాటిళ్లు సీజ్ చేశామని ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. వారిపై కసు నమోదు చేశామన్నారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం



ప్రారంభానికి నోచుకోని భవనం

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్లలో రెండేళ్ల క్రితం రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిచకపోవడంతో.. అది నేటికీ నిరుపయోగంగా ఉంది. ఈ భవనం చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఈ నూతన భవనాన్ని ప్రారంభించకపోవడంతో.. పాత భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

పోలీసుల తనిఖీ

తాడిపత్రి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో నక్సలైట్లు వచ్చారని పుకార్లు రావడంతో పోలీసులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ ధరణీబాబు సిబ్బందితో కలిసి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఊరుచింతల, తలారిచెరువు, అదాని సిమెంట్ పరిశ్రమ, ఎల్అండ్‌టీ, సాగర్‌సిమెంట్ తదితర పరిశ్రమలతోపాటు కొండప్రాంతంలోని గ్రామాలన్ని తనిఖీలు నిర్వహించారు.

- నాకాబందీ : పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో పట్టణ సీఐ ఆరోహణరావు, పెద్దపప్పూరు సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఐలు గౌస్, ధరణీబాబు, నాగేంద్రప్రసాద్, ఆంజనేయులు నాకాబందీ నిర్వహించారు. అనుమానిత ఇళ్లను తనిఖీచేశారు. రికార్డులు లేని 3 బైక్‌లను ఒక ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

మానవత్వం చాటుకున్న నాయకులు


మతిస్థిమితం లేని వ్యక్తికి కటింగ్ చేసి.. స్నానం చేయిస్తున్న నాయకులు

కూడేరు, నంబవరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి నెల రోజులుగా మాసిన దస్తులతో.. భారీగా జుట్టు పెంచుకొని అపరిశుభ్రంగా తిరుగుతున్నారు. అతన్ని గమనించిన ఉరవకొండ నియోజక వర్గ టీడీపీ నాయిబ్రహ్మణుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఆమిద్యాల రాములు ఆదివారం అతనికి జుట్టు తొలగించి.. స్నానం చేయించి.. మంచి దుస్తులు వేశారు.